

# మాటా మంతీ

-సాయి పద్మ



*9*

## కంటి శుక్రవారము గడియ లేడింట..

కంటి శుక్రవారం గడియ లేడింట ..అని వెంకటేశ్వరస్వామి మీద కంప్లైంట్ చేసాడు గానీ.. అన్నమయ్య .. ఈ డిజిటల్ ఏజీ లో కూడా శ్రావణ శుక్రవారం ఆడవాళ్ళు చాలా బిజీ. ఎవరికీ దేనికీ తీరిక ఉండదు. ఈ పాటికి అర్ధం అయిపోయి ఉంటుంది శ్రావణ మహాలక్ష్మి పాపం ఈ నెల టార్గెట్ అని

ఎన్ని చేసినా, ఎన్ని మారినా , మారనివి .. లేదా కొత్త బ్రాండ్ వేసుకొనేవి, అక్షయ త్రితీయ, వరలక్ష్మీ వ్రతం. హాస్టల్ నుండి ఫోన్, “మేడం .. వరలక్ష్మీ వ్రతం కదా ..వొకరోజు సెలవు, ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక హోదా కోసం వొకరోజు బంద్.. పిల్లల్ని ఇంటికి పంపమంటారా ..?”

నేనన్నా “ఎందుకయ్యా .. చిన్నపిల్లలు వ్రతం చేయరు కదా.. ?”

“ఇప్పుడు ట్రైబల్ హేమ్లెట్స్ లో కూడా చేస్తారు మేడం. మేము కూడా ఇంటికి..!” అన్నాడు మా వార్డెన్ నసుగుతూ.

“లక్ష్మీ దేవి.. నీ అంత పవర్ఫుల్ ఎవరూ లేరమ్మా” అనికొని ..సరే అన్నా..!

గ్రామాల్లో, మోస్తరు టవున్ లలో, సిటీ లో కూడా.. మొత్తం ఇదే హడావిడి.. దానికి టెక్నాలజీ హంగులద్ది, ఫేమిలీ, ఫ్రెండ్స్ వాట్స్ అప్ గ్రూపుల్లో కూడా ఇదే! వర మహాలక్ష్మి, భర్తల కోసం , వాళ్ళ సౌభాగ్యం కోసం చేసుకొనే వ్రతమా!? అని వోకళ్ళు పోస్ట్ పెడితే, కాదు, కాదు, ఎవరన్నా చేసుకోవచ్చు సర్వ జన సౌభాగ్యం కోసం అని మరికొంతమంది ..!

సరే, ఎవరూ మాట్లాడని కొన్ని విషయాలు.. బ్రాహ్మణ మహిళలు, బ్రాహ్మణ ముత్తైదువలకే వాయినాలు ఇస్తారు. మరి కులం లేదు మతం లేదు అని గొంతు చించుకొనే వాళ్ళంతా , ఒక్కసారి ఇక్కడికి రండి అని అరవాలని అనిపిస్తుంది.

కొన్నేళ్ళ క్రితం , మేము ఈ ఇంట్లోకి వచ్చిన కొత్తలో, అసలు బయటకి ఎక్కువ వెళ్ళని నన్ను, ఎదురింటామె, పలకరించి వాయనం ఇచ్చిన సందర్భం గుర్తొస్తోంది. “నేను లేచి, మీకు అక్షింతలు వేయలేనండీ..” అంటే .. “మీరు బ్రాహ్మలంటగా.. పర్లేదండీ.. మీరు కూర్చొనే నాకు అక్షింతలు వేయండి ..!” అని నా కాళ్ళకి మొక్కిన అమాయకత్వం గుర్తొస్తోంది. బ్రాహ్మలైతే చాలు, దీవిస్తే సరిపోతుంది అన్న ఆమె నమ్మకానికి, ఏం చేయాలో తెలీక అక్షింతలు వేసాను!

వొక డిజేబుల్డ్ గా ఈ క్రతువులో నన్ను ఇంక్లూడ్ చేసుకున్నందుకు సంతోషించాలో, లేదా ప్రతీ క్రతువులో కుల ప్రాధాన్యంతో, మిగతావాళ్ళని ఎలిమినేట్ చేస్తున్నందుకు ఏడవాలో అర్ధం కాలేదు.

వొకప్పుడు, ఆర్ధిక అసమానతలు స్పార్క్ గా చూపించే నెల శ్రావణ మాసం అనిపించేది. వొక పబ్లిక్ సెక్టార్లో ఉద్యోగం చేస్తున్న , ఎక్సేక్యూటివ్ భార్య అయిన నా ఫ్రెండ్ చెప్పిన మాటలు విని నేను షాక్ అయ్యాను. ఆమె, బాగా చదువుకుంది, ఇండియా అంతా తిరిగే ఉద్యోగస్తుడు వాళ్ళ నాన్నగారు, పెళ్లి కూడా అలాగే కులప్రసక్తి లేకుండా జరిగింది. కొలీగ్స్ ఇంటిలో వరలక్ష్మీ వ్రతం అందర్నీ పిలిస్తే తను కూడా వెళ్ళింది. ఇచ్చిన వాయినం, బ్రాహ్మిన్ కాదని తెలిసి వెనక్కి తీసేసుకున్నారు అంట. ఏ కాలంలో ఉన్నాం మనం? క్రతువుకి, పూజలకి, సేక్యూలేడ్ గా చేసుకోవాలంటే, మిగతావాళ్ళని పిలవటం దేనికి ?

ఇదో కొత్త అంటరానితనమా? ఇలా అని ఎవరి మత నమ్మకాలని కించపరచాలని కాదు. కానీ, ఈ కాలంలో కూడా మనిషిని మనిషిగా చూడకపోతే క్రతువులు, పూజలు, మనల్ని ఎంతవరకూ కాపాడతాయి ? అన్నది వొక్కసారి ఆలోచించుకుంటే, మనం ఇలాంటి అర్ధం లేని పనులు చెయ్యం..!

వరలక్ష్మీ వ్రతం అంటే, కొత్త బట్టలూ, ఆగకుండా చేసే బట్టలూ, బంగారాల కొనుగోలు కాదు. మనిషిని మనిషిగా గౌరవించి, పక్క వాళ్ళ చిన్న చిన్న ఆనందాల్లో పాలు పంచుకోవటం కూడా. కాటుక కంటినీరు చనుకట్టు పయంబడ .. అని కవి అన్నట్లు.. వొక మహిళ కన్నీరు , మరో మహిళ పూజలో పన్నీరుగా మారదుగా??

ఆలోచించండి.. మళ్ళీ వచ్చే నెల కలుద్దాం..!

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments